క్లుప్తంగా

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

మహదేవపూర్: జ్యోతిరావుపులే, సావిత్రీబాయి పులే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో విలేకర్ల సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉడుత బాబు అనేవ్యక్తి గొడ్డలితో విగ్రహాలను పగుగొతుండగా గ్రామస్తులు పట్టుకోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనాలు పునారవృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

మహదేవపూర్: మండలంలోని బ్రహ్మణపల్లి కి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తడకల రమేష్ తల్లి తడకల లక్ష్మి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టమధుకర్, మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు పాల్గొన్నారు.

గుండెపోటుతో భక్తుడి మృతి



ఏటూరునాగారం: మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా ఐనవోలు గ్రామానికి చెందిన ఎర్రం రవీందర్(50)భార్య రాజ్యలక్ష్మి, ముగ్గురి పిల్లలతో కలిసి మేడారంలో జాతర సందర్భంగా కూల్‌డ్రింక్ షాపు పెట్టాడు. కాగా, శుక్రవారం తల్లులను దర్శించుకునే క్రమంలో క్యూలో ఒత్తిడి కారణంగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఇప్పటికీ జాతరలో నలుగురు మృతి చెందగా 75 మందికి గాయాలయ్యాయి.

రైతులను మోసం చేసిన వ్యక్తికి జైలుశిక్ష

శాయంపేట : అరటి మొక్కలు తీసుకొని రైతులకు ఇవ్వకుండా మోసం చేసిన ఘటనలో వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4వేలు జరిమానా పడింది. పరకాల మెజిస్ట్రేట్ లింగం శాలిని ఈ మేరకు తీర్పునిచ్చారు. స్థానిక ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగట్టుసింగారం గ్రామానికి చెందిన ఆలేటి సతీష్ కిసాన్ అగ్రో బయోటిక్స్ నుంచి 800 అరటి మొక్కలను శాయంపేట గ్రామానికి చెందిన ఉప్పునూతుల రాంమూర్తి, కోల మల్లయ్యకు ఇచ్చేందుకు తీసుకొచ్చాడు. అదే క్రమంలో శాయంపేటకు చెందిన రైతులు నల్లెల రమేష్, మల్లయ్యకు చేరవేసే క్రమంలో చెట్లబండి వెళ్లేందుకు దారిలేదు. దీంతో రమేష్ తన వద్ద ఉంచుకొని తరువాత ఇస్తానని మొక్కలు తీసుకున్నాడు. రైతులకు ఇవ్వకుండా మోసం చేయడంతో ఆలేటి సతీష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో 2017 సంవత్సరంలో రమేష్‌పై ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి చీటింగ్ కేసు నమోదు చేసి పరకాల సబ్ జూనియర్ కోర్టుకు పంపించారు. ఈ మేరకు శుక్రవారం పరకాల మెజిస్ట్రేట్ శాలిని సాక్షులను విచారించి రమేష్‌కు నాలుగేళ్ల సాధరణ జైలుశిక్షతో పాటు రూ. 4వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన ఏసీపీ రుదిర కర్రు, ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ రంజిత్‌రావు, ఎస్సై దేవేదర్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ప్రసాద్‌ను ఆమె అభినందించారు.

జాతరలో తాగునీటి కష్టాలు



నల్లాలు, చేతి పంపుల వద్ద కొట్లాడుతున్న భక్తులు



క్యాన్లలో నీటిని తీసుకెళ్తున్న భక్తులు



ఖాళీ బిందెలతో క్యూలో మహిళలు

- ఏర్పాటు చేయని పైపులైన్లు
- భక్తులకు తప్పని ఇబ్బందులు

మేడారం (భూపాలపల్లి అర్బన్): మేడారం జాతరలో భక్తులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని అధికారులు పలుమార్లు ప్రచారం జోరుగా చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో భక్తులకు కావాల్సిన కనీస సౌకర్యాలు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తల్లుల దర్శనం కోతం మూడు రోజుల క్రితమే మేడారం చేరుకున్న భక్తులకు తాగునీటి కటకట తప్పడం లేదు. ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న క్యాన్లు ఖాళీకావడంతో భక్తులు తాగునీటి బాట పట్టారు. గద్దెల సమీపం నుంచి చిలుకల గుట్ట వైపు కిలోమీటరున్నారా పాడువున రెండు నల్లాలు, ఒక చేతి పంపు మాత్రమే ఉంది. ఊరట్టం వైపు జంపన్న వాగు అవతలి వైపున కూడా నల్లాలు ఏర్పాటు చేయలేదు. భక్తులు జంపన్న వాగులో చెలిమలను తోడుకోని మంచినీళ్లు తాగుతున్నారు. అంతంత మాత్రమే ఏర్పాటు చేసిన నల్లాల వద్ద భక్తులు సుమారు అరగంట నుంచి గంట పాటు వేచి ఉండి నీళ్లను పట్టుకుంటున్నారు. మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. తాగునీటి ఇబ్బందులపై సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు.

మంగపేట(మేడారం): మేడారం మేడారం పరిసర ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపులు చుక్కనీరు రాకుండా నిరుపయోగంగా ఉన్నాయి. అక్కడక్కడ పనిచేసిన చేతి పంపుల వద్ద వందలాది మందికి పైగా క్యూలో గంటల కొద్ది వేచి ఉండాల్సి రావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాటర్ ప్లాంట్ల వద్ద క్యూలో నిలబడి మరీ 20 లీటర్ల వాటర్ క్యాన్‌కు రూ.100 నుంచి రూ.120 వరకు వెచ్చించి కొనుగోలు చేశారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మేడారం జాతరకు మూడు రోజుల క్రితం చేరుకున్నాం. నాటి నుంచి మంచి నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. డబ్బులు పెట్టి కొనుకున్నా సరిపోవడం లేదు. నల్లాల వద్ద గంటల కొద్ది ఉండి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్యాంకర్లతో కూడా నీళ్ల సరఫరా చేయడం లేదు.

- రావుల కార్తీక్, హైదరాబాద్

గంట సేపు లైన్‌లో ఉన్నాం..



తాగునీటి కోసం ఇబ్బందులు అంతా ఇంతా కాదు. నీళ్ల కోసం నల్లాల వద్ద గంటల కొద్ది సమయం కేటాయించాల్సి వస్తోంది. రెండు క్యాన్ల కోసం నాలుగురం లైన్లో ఉన్నాం.

-పెసర చంద్రకళ, స్టేషన్‌ఘన్‌పూర్

తాగు నీరు సరఫరా చేయాలి



జాతరకు వచ్చి మంచి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. నీళ్ల కోసం మహిళల బాధలు చెప్పలేనివి. నీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమైయ్యారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలి.

-ఎంపెల్లి రమ్య, జనగామ భక్తురాలు

జాతరలో పోలీసుల ఓవరాక్షన్

మంగపేట: మేడారం మహాజాతరలో కొంత మంది పోలీసులు అత్యుత్సాహం చూపారు. మీడియా ప్రతినిధులతో దురుసుగా ప్రవర్తించారు. సీఎం రేవంత్‌రెడ్డి కవరేజ్ కోసం దేవాదాయశాఖ అవరణలోని మీడియాపాయింట్ వద్దకు ఎండోమెంట్ గేట్ ద్వారా వెళ్తున్న మీడియా ప్రతినిధులను అడ్డుకున్నారు. దీంతో జర్నలిస్టులు పోలీసుల తీరుపై అందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మీడియాపై అవగాహన లేని ట్రెయినీ ఐపీఎస్ అధికారి వెళ్లనివ్వకపోగా దురుసుగా ప్రవర్తించారు. ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్ కవరేజ్ చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ వినలేదు. ఒకరిద్దరు మీడియా ప్రతినిధులు ములుగు ఎస్పీతో మాట్లాడాలని సూచినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో చేసేది లే సుమారు రెండు గంటల పాటు గేటు ముందు నిరీక్షణ తప్పలేదు.



ప్రధానద్వారం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

లారీని ఢీకొట్టిన తుఫాన్ వాహనం

- అక్కడికక్కడే ఇద్దరి మృతి
- మృతుల్లో సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్



వాహనంలో ఇరుక్కుపోయి మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ పెరుమాళ్

వాజేడు: ఆగి ఉన్న ఐరన్ లోడ్ లారీని వెనుక నుంచి తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో అందులో ఉన్న ముగ్గురిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఒకరు సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఉన్నాడు. ఏఎస్ఐ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పాయబాటలు గ్రామం వద్ద 163 నంబర్ జాతీయ రహదారిపై ఛత్తీస్‌గఢ్ నుంచి తమిళనాడుకు చెందిన లారీ ఐరన్ లోడ్‌తో వచ్చింది. రహదారి పక్కన ఆపిన డ్రైవర్ భోజనం చేస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన తుఫాన్ వ్యాన్ లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో లారీలోని ఐరన్ రాడ్లు బలంగా తగలడంతో వ్యాన్‌లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మిల్కాపెల్లి గ్రామానికి చెందిన పరాట సురేష్(15), పేరూరు పోలీస్‌స్టేషన్ సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.పెరుమాళ్(50) అక్కడికక్కడే మృతి చెందారు. పెరుమాళ్‌ది తమిళనాడు రాష్ట్రం పుదుచ్చేరి పరిధి తోరుభువనై గ్రామం. శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు సెలవు పెట్టి ఇంటికి బయలుదేరిన ఆయన.. వాజేడు మండల పరిధి చెరుకూరు వద్ద తుఫాన్ వాహనం ఎక్కి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ సీటు పక్కన ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడగా డ్రైవర్ జవ్వా వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉంది. అతడిని ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి పోస్టు మార్టమ్ నిమిత్తం తరలించారు. లారీ డ్రైవర్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీని ఢీ కొట్టిన తుఫాన్ వాహనం



మృతి చెందిన పరాట సురేష్

‘నీళ్లు ఇవ్వడంలో అధికారుల ఇష్టారాజ్యం’

గోవిందరావుపేట: లక్నవరం చెరువులోని నీటిని రోటేషన్ పద్ధతిలో కోట కాల్వకు 2000 ఎకరాలకు నీరు ఇస్తామని అధికారులు ప్రకటించి, మేడారం జాతరకు ఇవ్వడంలో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐబీ అధికారుల నిర్లక్ష్యం వలన చెరువు కింద మరో రెండు వేల ఎకరాలు సాగును అక్రమంగా చేశారని ఆరోపించారు. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల జాతరకు మూడు రోజుల ముందే నీళ్లు వదిలి రంగాపూర్ ప్రాజెక్ట్ నిల్వ చేస్తామని చెప్పి తిరిగి 20న బంద్‌చేసి మళ్లీ 21న సాయంత్రం నీరు వదిలి 23 వరకు కూడా బందు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో నీరు విడుదల చేసిన విధంగా ఈ సంవత్సరం కూడా విడుదల చేయాలని రైతులు అధికారులకు చెప్పిన ఫలితం లేకుండా పోయింది అన్నారు. భవిష్యత్‌లో పంట పొలాలు ఎండిపోయే అవకాశం ఏర్పడిందని అని అన్నారు. నేటి వరకు ఇంక నాట్లు వేస్తూనే ఉన్నారని, పొలాలకు నీరు అందక ఎండిపోతే అధికారులే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఇప్పటికైనా మేడారం జంపన్న వాగుకు నీరు తక్షణమే బంద్ చేసి అక్రమ సాగును అరికట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ పండుగగా గుర్తించాలి



ఎత్తు బంగారం తూకం వేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఎత్తు బంగారం తూకం వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మేడారం(కాటారం/కాళేశ్వరం): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీ ధర్‌బాబు అన్నారు. శుక్రవారం మంత్రి సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎత్తు బంగారాన్ని అమ్మవారికి సమర్పించారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం జాతరకు భారీగా నిధులు మంజూరు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసిందన్నారు. దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గిరిజన దైవాలైన సమ్మక్క-సారలమ్మను దర్శించుకుంటున్నారన్నారు. ఇంత ప్రాచూర్యం కలిగిన మేడారం జాతరను కేంద్రం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. ఈఅంశంపై కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. మేడారానికి జాతీయ హోదా కల్పిస్తే మరింత అభివృద్ధి జరిగి ఆదివాసీ, గిరిజనులకు లబ్ధి చేకూరుతుందని, కేంద్రం వెంటనే మేడారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఉన్నారు. మేడారంలోని తల్లుతకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మేడిగడ్డపై రాద్ధాంతం ఎందుకు?



కొప్పుల ఈశ్వర్‌ను సన్మానిస్తున్న అర్చకులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో ఒక ఫిల్లర్ కుంగితే కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరిత హోటల్‌లో విలేకర్లలో మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడంతో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. రైతు బంధు, వృద్ధులకు పింఛన్, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నారన్నారు. ఓ మంత్రి పీఏ ఇసుక మాఫియాతో చేతులు కలిపారని ఆరోపించారు. ఇసుక లారీలను ఎందుకు బంద్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రెండు నదులు కలిన చోట నిర్మిస్తే మంత్రుల బృందం వెళ్లి గగ్గోలు పెడుతుందన్నారు. ఖర్చు పెంచారని లేనిపోని ఆరోపణలు చేస్తుందన్నారు. కేసీఆర్ అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కోడి గుడ్డు మీద ఈకలు పీకుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను లేనిపోనివి చెబుతూ మభ్యపెడుతుందని అన్నారు. ఆయన వెంట దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్త అడప సమ్మయ్య, నాయకులు ప్రకాశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

వనదేవతలకు భక్తుల మొక్కులు

- జనంతో నిండిన మినీ మేడారం జాతర ప్రాంగణాలు

చిట్యాల: మండలంలోని వెంచర్యామి శివారు పూరేడు గుట్టలో నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వన దేవతలు వనం వీడి జనంలోకి రావడంతో వనమంతా జన జాతరగా మారి భక్తులతో కిటకిటలాడింది. వన దేవతలకు భక్తులు మొక్కులు చెల్లించి తల్లులకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, పూలు, పండ్లు, వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. వనదేవతల సంప్రదాయ పద్ధతిలో పూజారులు ప్రత్యేక పూజలతో భక్తులకు బంగారం, పసుపు, కుంకుమలను అందించి ఆశీర్వదించారు. ఈ జాతరకు జిల్లాతో పాటు, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల నుంచి భక్తులు ప్రైవేటు వాహనాలు, ఎడ్లబండ్లు, ఆర్టీసీ బస్సుల్లో తల్లుల చెంతకు చేరారు. నేడు(శనివార) తల్లులు వన ప్రవేశం జరుగనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట, కమలాపూర్‌లో మినీ మేడారం జాతరలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులతో పాటు పోలీసులు చర్యలు తీసుకున్నారు. నేడు (శనివారం) సాయంత్రం తల్లులు వన ప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

మొగుళ్లపల్లి: ముల్కలపల్లి-మొగుళ్లపల్లి గ్రామాల మధ్య నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా తల్లులు గద్దెలపై ఉండడడంతో శుక్రవారం భక్తులు వేల సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాతర కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకతో జాతర ప్రాంగణం రద్దీగా మారింది. రెండు, మూడు గంటలు చిన్న వాగు బ్రిడ్జిపై ట్రాఫిక్ జాం కావడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. గ్రామ వాస్తవ్యులు ఎల్‌బీనగర్ అదనపు ఫ్యామిలీ కోర్టు జడ్జీ చిలుకమారి పంచాక్షరి దంపతులు తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎద్దు బెదిరి మీదికి రావడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులో గల సమ్మక్క-సారలమ్మ మినీ మేడారం జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వనదేవతాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



మొగుళ్లపల్లి: భక్తులతో జాతర ప్రాంగణం



చిట్యాల: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ఆవుకు మొక్కుతున్న భక్తులు



రంగుల రాట్నం ఎక్కిన భక్తులు



మొగుళ్లపల్లి: ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు



రేగొండ: జాతర ప్రాంగణంలో భక్తుల కోలాహలం